# విధ్వంస దృశ్యం

■ ఆడెపు లక్ష్మీపతి

ఇరుకిరుకు దారుల్లో నిప్పు కుంపట్ల మధ్య నడుస్తున్నట్టుగా ఉంది. ధరలు భగ్గుమనడమంటే ఏమో అనుకున్నావ్- ఇప్పుడర్థమౌతోంది కదూ. బాగా కమిలి మగ్గుతున్న- కుళ్ళి పులుస్తున్న, మోటారు ఇంధనం కాలుతున్న-శరీరాల చెమట కంపు కొడుతున్న ఘాటు వాసన గంధక ధూమంలా, చెదరని మేఘంలా ఒళ్ళంతా చిరచిరలాడిస్తూ... పండి పక్వానికొస్తున్న తియ్యటి వాసన కదిలీకదలని పిల్ల తెమ్మెరలా లిప్త కాలం పాటు ముఖాన్ని స్పృశిస్తూ...

గాలి వీచదు, చెమట ఆరదు. అయినా, ముదురు టెండలో మార్కెట్‌కని బయల్దేరి పాలిస్టర్ చీర ఎందుక్కట్టుకున్నానా అని ఇప్పుడు వాపోవడం నిజంగా బుద్ధి తక్కువ పనే. అదిగో ఆ బెంగాలీ అమ్మాయిని చూసైనా నేర్చుకోవాలి. నీలిపూల తెల్లని కాటన్ ప్రింటెడ్- మైసూర్ కాటన్ లేదా యూపీ హ్యాండ్లూమ్ వెరయిటీ. పెద్దపెద్ద పూలతలు డిజైన్‌గా అద్దిన పొడవాటి చీర కొంగు దాదాపు నేలకు ఆనుతూ, ఒత్తయిన నల్లని కురచ జుట్టు పోనీ టైల్ ముడి చిన్నగా చెదరుతూ, కొంగుచాటు నీలి జాకెట్ ఎగువన నున్నటి మెడ- అక్కణ్ణుంచి అవతలివైపు దిగువకు విస్తరించుకుపోయిన వీపు అందంగా బహిర్గతమౌతూ, స్లీవ్‌లెస్ జబ్బల దంతపు వర్ణం కాంతి మెడలోని సన్నని బంగారు గొలుసు తళతళలతో పోటీపడుతూ... నాజూకుగా నడుస్తున్న ఆ సింపుల్ బ్యూటీ ఆమె మోస్తున్న ప్లాస్టిక్ బుట్టలో నవనవలాడుతున్న కూరగాయల రాశి లాగే తాజాదనానికి నిలువెత్తు నిర్వచనం. పేరు హేమగాత్రి లేదా సుమగాత్రి అయి ఉండాలి. పాలతో స్నానం చేయించినట్టుగా తెల్లగా మెరుస్తున్న బుల్లి కారులో స్టీరింగు ముందు కూర్చున్న యువకుడు డోర్ తెరిచి బుట్ట అందుకుంటూ నవ్వుతూ... దబ్బపండు రంగు నిండు బుగ్గల మీద క్లీన్ షేవింగ్ బాపతు పచ్చని చారలు చిత్రంగా సాగుతూ ఎర్రని నోట్లోని సూపర్‌వైట్ పలువరున టి.వి ప్రకటనలో లాగా ఫ్లాష్ ఫ్లాష్... నిజంగా మేడ్ ఫర్ ఈచ్ అదర్. జి.ఎంగారి అబ్బాయో, చీఫ్ ఇంజనీర్‌గారి అమ్మాయో అయి ఉండాలి. దేనికైనా పెట్టి పుట్టాలంటారు! ప్చ్.

"ఏమమ్మో! ఏం కూరగాయలు గావాలే?" గొడుగు నీడలో కూర్చుని వేడివేడి టీ తాగుతున్న ముసలమ్మ గారపళ్ళ సందు నుండి గుగ్గిలం చిందులాంటి పలకరింత...

ఇంట్లో కూరగాయలేమీ లేవు. ఆ మాటకొస్తే సరుకులన్నీ నిండుకున్నాయ్. ఇది పెద్ద విశేషమేమీ కాదు. లేమిలో కూడా సర్దుకుపోవడం, పప్పో, పచ్చడో వేసుకుని పూటలు గడపడం మామూలు వ్యవహారమే. పర్సులో ఎంతుందో చూసుకో ముందు. పది ప్లస్ పది ప్లస్ చిల్లర. పాతికో పరకో. కంపెనీ రజతోత్సవ వేడుకలు కనీస స్థాయిలోనైనా జరుపుకోవాలని యూనియన్లూ, అసోసియేషనూ అర్జీ పెట్టుకున్నాయట. అసలు జీతాలకే ముమ్మందు ఫండ్స్ లేవంటూ మేనేజ్‌మెంట్ వాళ్ళ ముఖాల మీదే తలుపులు బిడాయించుకుందట. సిల్వరూ లేదు, గోల్డూ లేదు. మీ వైవాహిక జీవితపు సిల్వర్ జూబిలీ సంవత్సరంలో సైతం మట్టి చిప్పల టకటకలే. డబ్బుకెప్పుడూ కటకట. ఎంతో చిన్న కోర్కెకూ, దాని సిద్ధికీ నడుమ అధిగమించజాలని అగాధం. అడుగడుగునా రాజీ. అనుక్షణం రాజీ. మెడ మీద కత్తి పెట్టి నిన్ను బలవంత పెట్టేవాళ్ళెవరూ లేరు. కానీ, సున్నితమైన సెంటిమెంట్లు, తెంచుకోలేని బాధ్యతలు, మరీ భారమవుతున్న కుటుంబ ఖర్చులు, పిల్లల భవిష్యత్తు గురించిన తడియారని చిన్ని చిన్ని ఆశలు సొంత సౌభాగ్యాన్ని చంపుకోవాల్సిందిగా క్రూరంగా శాసిస్తాయి.

"టమాట ఎలా ఇస్తున్నావ్?"

"...కిలో పదహారమ్మా. ఫూల్‌గోబీ ఇరవై రుపాల్. పచ్చిమిర్చి అరకిలో పన్నెండు..."

"ఓహ్... ఒక్కక్షణమిక్కడుంటే కాలిపోతావ్. ముందుకు పద. కొంచెం వెసులుబాటుగా ధర ఉంటుందనుకున్న చోట ఆగు. కిలోలు కొనే ఉద్దేశమూ లేదు, అంత తాహతూ లేదు. ఇవాళ్టికీ, రేపటికీ సరిపడా ఒకట్రొండు రకాల కూరగాయలు- ఏదీ పావు కిలో చాలు. ఊహూఁ సరిపుచ్చుకోవాలి. పల్లూకి దోసకాయ పప్పు, టమాట చారు అంటే చాల ఇష్టం. అన్నూగాడు బెండకాయ వేపుడు నంజుకుంటూ పల్చటి పప్పు చారు, నెయ్యి కలిపిన వేడి అన్నం లొట్టలేసుకుంటూ తింటాడు. ఆయనకు...? కోరి చాలా ఏళ్ళయింది. మరి నీకు...? మర్చిపోయావ్! 'పులుపూ కారాలు అతిగా తింటే కడుపులో మంట. క్రమంగా అల్సర్‌కి దారి తీస్తుంది జాగ్రత్త.' 'నోరు పెచ్చడం, కీళ్ళు-కాళ్ళు పీకడం, జుట్టు రాలడం- వీటికి ప్రత్యేకంగా మందులంటూ ఉండవ్. మంచి తిండి తినాలి. విశ్రాంతి తీసుకోవాలి.' డాక్టర్లకేమి. వాళ్ళు ఏవేవో సలహాలిస్తారు. మోసేవాడికి తెలుసు కావడి బరువు. పోయిన ఆదివారం నాడు మంచి టిఫిను తినాలనుందే అని అన్నారాయన. ఏం టిఫిను కావాలి అని అడిగావు నువ్వు. వేడివేడి ఇడ్లీలు, నెయ్యి, కొబ్బరి పచ్చడి అన్జెప్పి, జోక్ చేసినట్టుగా పెద్దగా నవ్వారు. అది జోక్ కాదు. నిజంగానే అన్నారని తర్వాత తెలిసింది. ఫ్యాక్టరీ క్యాంటీన్‌లో సబ్సిడీ ఎత్తేశాక తినుబండారాల రేట్లు నాలుగింతలు పెరిగాయట, ఈయన భీషణ నిర్ణయం తీసుకుని టిఫిన్లు తినడం మానేశాడు. పరిస్థితులు పురికొల్పిన నిస్సహాయతకీ, ఆయన అవస్థకీ ఆ క్షణంలో కడుపు తరుక్కుపోయింది. కానీ ఆయన చేష్టలూ, చేసిన నిర్వాకాలూ తలుచుకుంటే మాత్రం ఒళ్ళు మండుతుంది. నా వాళ్ళూ, నా మూలాలూ అంటూ ఇన్నేళ్ళూ చేసుకొచ్చిందంతా కన్నవాళ్ళకూ, తోడబుట్టినవాళ్ళకూ ధారవోశాడు. పెళ్ళాంబిడ్డల్ని పాకురుబండ మీద నిలబెట్టాడు. ఇంతా చేస్తే చివరికి చేతికి చిక్కిన కీర్తి కిరీటమేది? అందరి చేతా స్వార్థపరుడు అనే నింద తప్ప!

వీడిదో గోల. కాష్ఠంలో సగం కాలి పొగ చూరిన తుమ్మమొద్దులా కారు నలుపూ, గేదె ముఖమూనూ. సొల్లు కారే నోట్లోని బర్రె పళ్ళన్నీ బయట పెడుతూ...

"తాజా తాజా కూరగాయల్. ఇగో మన దేశపు టమాట. యమ అగ్గువ. పావు కిలో అయిదు. కిలో తీస్కుంటె పదహార్రూపాలే. పాలకూర నాల్గు రూపాల్ పావు. వంకాయలు మూడు... పత్తా గోబీ కిలో పది హేనుకేస్తనమ్మా... దా..."

ధూథ్... అగ్గువట అగ్గువ. వీన్నో ట్లే... తుమ్మమొద్దు మీద కొంగ రెట్ట పడ, వీళ్ళ మొకాల కగ్గి తగల- అందరూ కూడబలుక్కున్నట్టు ఒకటే పాట. హసన్ హుసేన్ య్యాలి య్యాలి. కొరడాలతో నెత్తుర్లు కారేటట్టు వాయింపు. హింస. నీ మంట వీళ్ళకెలా తెలుస్తుంది? కూరగాయలు కొనేందుకొచ్చిన మనుషులను చూసి అసలు ఈ పల్లెటూరోళ్ళేమనుకుంటారు? కాయగూరలు చెట్లకు కాసినట్టు డబ్బులూ మీ ఇండ్లల్లో పండుతాయనుకుంటారా, వెధవలు. వెధవన్నర బతకులు. గొర్రె తోక జీతాలు. పెరుగుతున్న ఖర్చులు, తరుముతున్న అవసరాలు. ఎలా వేగాలిరా దేవుడా అని ఇక్కడి జనం అంగోలిస్తుంటే, తోడేళ్ళ మందలా వీళ్ళు దాపురించారు. పనివాడు, పాలవాడు, మోచీవాడు, చాపలమ్మేవాడు, ఆఖరికి చాకలివాడు- అందరూ పీక్కుతినేవారే. లాండ్రీ బండి సుగుణమ్మ పెద్దపెట్టున రేట్లు పెంచేసింది. ఇస్త్రీ-జతకి మూడు రూపాయలు, చీర నాలుగు రూపాయలు. ఒక్కసారిగా అలా పెంచడమేమిటీ అనడిగితే, మేమెట్లా బతకాలమ్మో అని ఎదురు ప్రశ్న! బర్కతి లేని ముండలు. అది ఎంత సంపాదించినా దాని మొగని తాగుడుకు సరిపోదు. వాకిళ్ళూడ్వడానికొచ్చె అన్నమ్మ మొన్ననే అల్టిమేటమిచ్చింది- దాని జీతం ఇంకో ఇరవై రూపాయలు పెంచకపోతే పని మానేస్తుందట. దాని కొడుకును ఏదో స్కూల్లో చేర్పించినట్టుగా చెప్పుకుంటుంది గాని, అక్షరమ్ముక్క రాని ఆ పూసుకండ్ల పిల్లాడు ఎప్పుడూ తల్లి కొంగు పట్టుకునే తిరుగుతాడు. సైకిలు తొక్కడం నేర్చుకోబోయి కింద పడ్డాడట- చేయి పుటుక్కుమని విరిగింది మొన్న. మామూలు జనాల రక్తం జుర్రుకునే వాళ్ళెవరైనా బాగుపడతారా! అంతకంత దరిద్రం చుట్టుకుపోదూ.

"హాయ్ కమలా! బావున్నావా? ఏమిటీ ఈ వేళప్పుడు మార్కెట్లో?"

రెండు మూరల మల్లెదండను మడతలు వేసుకుంటూ నవ్వుతూ శిరీష. అసలే ఆకర్షణీయమైన పర్సనాలిటీ. అందులోనూ మరింత అందంగా చూపుతున్న ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన లేత పెసరంగు టస్సర్ షేడెడ్ చీర. ఎక్కడ కొన్నదో... మంగతాయారు దగ్గరే అయివుంటుంది. మంగతాయారు ఇంట్లోకి నాలుగు రోజుల కిందటే కొత్త స్టాకు దిగినట్టుగా లీలాబాయి చెప్పింది- పార్వతింట పేరంటానికి ఆడాళ్ళందరూ కలుసుకున్నప్పుడు. కాటన్ వెరైటీలు, కొత్త మోడల్ చీరలు, డ్రెస్‌లు ఈసారి ఎక్కువగా వచ్చాయిట. పాత బ్యాలన్సులో కొంతయినా చెల్లించగలిగితే... నీ కోసం సాదా సీదావైనా రెండు కాటన్ చీరలు, పల్లు కొరకో సల్వార్ సూటు తీయవచ్చు. అది ఇవ్వనసదు కానీ, సున్నితంగా గుచ్చుకునే ఎగతాళి మాటలు రువ్వుతుంది. భరించాలి. చిన్న మొత్తాలు వడ్డీకి తిప్పుతుంది కాబట్టి శిరీష చేతిలో ఎప్పుడూ డబ్బు ఆడుతుంది. దీని సెలెక్షను వినూత్నంగా ఉంటుంది. తిరిగే ఆడది కదా అని అందరూ గుసగుసగా అంటారు. ఔనూ, ఈమధ్య ఈవిడ రంగనాయకితో దోస్తీ కటీఫ్ చేసింది. కుల సంఘం వాళ్ళు విరుచుకుపడే సరికి ఈ కొజ్జా భర్త పెళ్ళాన్ని హెచ్చరించి, అదుపులో పెట్టాడని అందరూ బాహాటంగానే అనుకున్నారు. గుడి వీధిలో బస్తీవాసులు నిఘావేసి రంగనాయకిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారట. దాని మొగుడి ముఖాన ఖాండ్రించి ఉమ్మేశారట. విటుడు మాత్రం గోడ దూకి పారిపోయాడట. ఊళ్ళో మగవాళ్ళ చూపులన్నీ తన వెంటే తిప్పుకు తిరిగే 'తళుకుబెళుకుల గొల్లభామ' అకస్మాత్తుగా మాయమైపోయిందేమిటీ అని చిట్టీపాట దగ్గర ఎవరో అడిగిందే తడవుగా ఉమారాణి ఈ విషయాలన్నీ ఊరించి ఊరించి చెప్పింది.

నెచ్చెలీ, నువ్వు వెళ్తే వెళ్ళావు- నీ ఆశయాన్ని నేను

> "తాజా తాజా కూరగాయల్, ఇగో మన దేశపు టమాట. యమ అగ్గువ. పావు కిలో అయిదు... వంకాయలు మూడు... పత్తా గోబీ కిలో పది హేనుకేస్తనమ్మా... దా..."

చిత్రాలు: నర్సిం



ముందుకు తీసుకువెళ్తా అని ప్రతిన పూనింది కాబోలు ఈ శిరీష. "పిల్లలు పరీక్షలు రాసేసి వచ్చేశారు. ఇంతకాలం హాస్టల్ తిండి తిని చప్పబడ్డారు కదా. కోరినవి చేసి పెట్టాలి. కరువులో అధిక మాసం లాగా బంధువులూ, గెస్టులూనూ. అది సరే, పతీ సమేతంగా బయలుదేరావు. పేరంటానికా, గుడికా?"

"పెళ్ళిళ్ళకి. గౌతమీ నగర్‌లో వీరారెడ్డిగారి కొడుకు పెళ్ళి, పది గంటలకు. ఆ తర్వాత చౌదరి గారి కూతురి లగ్గం కమ్యూనిటీ హాల్లో. పన్నెండు గంటలకు హాల్లో కలుస్తావు కదా" అంది పూల చెండు జడలో తురుముకుంటూ, ఒయ్యారంగా నడుస్తూ, రోడ్డు మీద స్కూటరాపి వేచి ఉన్న పెనిమిటి వేపు కదుల్తూ.

చౌదరిగారి కూతురి పెళ్ళి బాగా గుర్తుచేసింది. ఎంగేజ్‌మెంట్‌నాడే ముప్ఫయ్ వేల దాకా ఖర్చయి ఉంటుందని అందరూ అన్నారు. పెళ్ళికి ఏర్పాట్లు ఎంత అట్టహాసంగా ఉన్నాయో. అల్లుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అట. నెల జీతం లక్షల్లో. అమ్మాయి యం.సి.ఏ. అక్కడ ఉద్యోగం రెడీగా ఉందిట. అమావాస్యనాడు పుట్టిందేమో పిల్ల- అందుకే అంత అదృష్టం. నీ పిల్లల చదువులు ఈ దిశలో సాగలేకపోయాయి. కారణం- కోచింగులకు గానీ, ప్రయివేట్ కాలేజీ చదువులగ్గానీ వాళ్ళు నోచుకోలేదు. గెస్టు అన్నారు, కంప్యూటర్ చదువులు లేదా మంచి వృత్తి విద్యా కోర్సులకే ఇది కాలం అని. సరియైన ప్లాను లేకపోవడం వల్లనే మీ జీవితంలో ఎదుగూ బొదుగూ కరవైందని విశ్లేషిస్తూ స్నేహితుణ్ణి మందలించారు కూడా. ఈయనకు ఎప్పుడు బుద్ధొస్తుందో ఏమో. ఎవరి మాటా వినడు. తన వాదం తనదే. రోజులు ఎప్పుడూ ఒక్కలాగా ఉండవు. పిల్లల భవిష్యత్తు కొరకు కొంతైనా కూడబెట్టుకోవాలయ్యా మగడా అని నెత్తీ నోరూ బాదుకున్నావ్. చెల్లి పెళ్ళి కోసమూ, తమ్ముడి ఉద్యోగ లంచం కోసమూ లోన్లు తీశాడు. అప్పు చేసి ముసలాళ్ళ కొరకు పల్లెటూర్లో ఇల్లు కట్టించాడు. కుర్చీలు, మంచాలు... ఆఖర్కి గ్రైండరూ పల్లెటూరికే జారగొట్టించాడు. కలర్ టీవీ కూడా అదే మార్గాన పోయేదే. కలలన్నీ కాలిపోయాయి. మన కోసం కాని మన బతుకులో ఈ చిన్న వినోద సాధనమన్నా ఉండనీ అని ఏడ్చావు కాబట్టి ఆగిపోయిందది.

"ఆగరాదమ్మో దొర్సాని! ఇన్నిన్ని కూరగాయలు, మన దేశపు తమాట, తాజా వంకాయలు, దొండకాయలు, పుల్ల కంద ,చ్చుటి కోత్మీర, పుదీనా. చూస్కుంటనే పోబడ్తివి. ఏం తీస్కుంటవు దా..."

దీని పేరు పద్మో, ప్రమీలో. తరాజు చేతిలో రెడీగా పట్టుకుని పిలుస్తోంది. అందరినీ బాగా పరిచయ మున్నదానిలా పలకరిస్తుంది, పిలుస్తుంది. ధూపదీప నైవేద్యాలు సమర్పించిన అమ్మవారిలా ఎత్తు చెక్కపీట మీద కూర్చుని... నుదుట రూపాయి బిళ్ళంత ఎర్ర కుంకుమ బొట్టు, చెవులకు పాత కాలపు బంగారు గెంటీలు, ఆదివాసీ స్త్రీలకుండే పెద్ద ముక్కుపోగు, జరీ అంచున్న ఎర్రని నూలు ముతక చీర. నవ్వదు, కోప్పడదు. లోకాన్ని విహంగవీక్షణంలో నిశితంగా పరిశీలిస్తున్నట్టుండే భావశూన్యమైన, కించిత్ గంభీర మైన దృక్కులు. జీర గొంతు విప్పితే ఆజ్ఞాపన వంటి ధ్వని ఎదుటివాళ్ళను నిలబెట్టేస్తుంది. అందరూ అంటారు- మార్కెట్‌కంతా ఈవిడే మకుటం లేని మహారాణి అని. వేకువ జామునే పల్లెటూర్నుంచి వచ్చే రైతుల్ని, గంపలవాళ్ళనూ పట్టేస్తుంది. తనక్కావల్సినంత లోడు తన అంగట్లో ముందుగా దింపేసుకుంటుంది. ఏ రకం కూరగాయలు ఏ రేటుకి అమ్మాలో గంపలవాళ్ళకీ, మారు బేరగాళ్ళకీ ఉత్తర్వు జారీ చేస్తుంది. గుడ్డేలుగుల పల్లి గేటు అవతలున్న ఈవిడ ఇంట్లోనే 'అన్నలు' అప్పుడప్పుడు సమావేశ మవుతారని వినికిడి.

"ఏం యాష్టపడ్తవమ్మా. ఎక్కడైనా గదే రేటు. ఇగో నీ కోసం తమాట పదియేసుకేస్త..." గబగబా టమాటపండ్లు తరాజు పళ్ళెంలో వేస్తూ. మరో మాట లేదు.

ఏ రాయైతేనేమి? ఎక్కడైనా సంచీ నిండదు. పర్సు ఖాళీ అవాల్సిందే.

"టమాట పావు కిలో చాలు. బెండకాయ కూడా. ఈ చిన్న కాలీఫ్లవర్ ఎంతుందో చూడు."

సూదుల్లా గుచ్చుకునే చూపులు ఎత్తింది అమ్మ వారు. "ఏం నాస్త తిన్నవమ్మా పొద్దుగాల?"

ఏమిటిది ఇలా అడుగుతోంది? నువు నీర్సంగా మరీ చిక్కిపోయినట్టుగా కనపడుతున్నావా ఏమిటి? "ఇంకా టిఫిన్ తినలే. ఉత్త టీ తాగొచ్చాను."

"ఎప్పుడైనా జొన్నంబలి తాగినవా?"

ఛ చ. అంబలి, గటుక ఇంటా వంటా లేవు. "ఊఁహూఁ."

"నువ్వే గాదు. రాళ్ళు గొట్టెటోళ్ళు, యెగసాయం చేసేటోళ్ళు, బొగ్గు బాయిలల్ల దిగేటోళ్ళు గూడ ఈ కాలంల గటుకంబలి దాగుతలేరు. ఎందుకో ఎరికేనా. జొన్నలేం అగ్గువ లేవు గాబట్టి. అవ్వెందుకు పిరమైనయ్? పంట లేదు."

ఇది మీ అత్తకు అమ్మమ్మలా ఉంది. ఏమో సోది జెపుతోంది. "కూరగాయలూ అందుకే ప్రియమైనాయా?"

"ఆగాగు. నేన్జెప్పేది పూరాగా ఇను. మన రుచులూ, రివాజులూ మారిపోయినై. ఎనుకట అంగ్రేజీవోడు మనకు చాయ్ ఫిరీగా తాపిచ్చిండట. గట్ల కొత్త కొత్తలవాట్లు, పద్ధతులు మనకు ఎవడెవడో నేర్పుతూ వస్తున్నారు. ఏమేమో సామాన్లు, వస్తువులు, మెషిన్లు కుప్పల కొద్దీ తయారుచేసే కంపిన్లొచ్చినయ్. చిన్న చాప జిమ్మలను మింగే పెద్ద చాప సోంటి కంపిని సర్కార్‌ను గుప్పెట పట్టి నడిపిస్తది. సర్కార్ మన కోళ్ళ్యాడగొట్టి వాని జేబులు నింపుతది..."

"సర్కార్లు, కంపిన్లు, మెషిన్లు గంత పెద్ద మాటలెందుకమ్మో. మా జేబులు కత్తి రిచ్చుట్ల మీరేమీ తక్కువ కిలాడీలు గారు. అడ్డగోలు రేట్లు జెప్పి మమ్ముల అదుర గొట్టుట్ల మీరు ఫస్టు. నిన్న జ్యోతి నగర్ సంతలో టమాట పన్నెండ్రూపాయలక్కిలో, వంకాయలు నాల్గు రూపాలక్కిలో. క్యాబేజీ పది... అట్ల యాభై రూపాయలల్ల సంచి నిండే కాయగూరలు. తేడా ఉంటే ఒకటి·లేదా రెండు రూపాయలు. కాని ఇట్లనా?"

ఎవరో ఈయన శుభ్రంగా సిల్కు లాల్చీ, పొడుగుబొట్టు. ఓహ్, మందిర్ కమిటీ కార్యదర్శి. గుళ్ళో జరిగే ప్రతి కార్యక్రమం చక్కగా నిర్వహింపబడేలా చూస్తాడు. కార్తీకమాసం పూజలకు భక్తుల్ని పెద్దయెత్తున సమీకరించి భజన్లు పాడిస్తాడు. అమ్మవారిని, ఛీఛీ ఈ మంత్రగత్తెను బలే నిలదీస్తున్నాడు. ఇట్లా అడగాలి. అడిగేవాళ్ళు లేకపోతే అలగాజనమూ పేట్రేగిపోరూ.

"ఆ అంగడి రోడ్డు మీనున్నది. పెద్దపల్లి, సుల్తానాబాద్ దగ్గరి ఊళ్ళళ్ళ నుంచి వారానికో పారి లోడొస్తది. కాళీ అయిపోద్ది. ఆ రేటు రైతులకు గిట్టుబాటయిద్దేమో, మాకు గాదు. ఈ కూరగాయలు ఇట్నుంచి సుట్టుదిరిగి..."

"ఆఁ ఆఁ. మా చెప్పొచ్చినవే, నీ కూరగాయలు అమెరికా నుండి దిగచ్చినట్టు. ఇక్కడ ఎవరూ కొనకుండ ఉంటే మీ రోగం కుదురుద్ది."

మంచి పాయింటే. నిజంగా అందరూ ఒక్క తాటి మీద నిలబడితే ఈ గంపల వాళ్ళు దెబ్బకు దిగొస్తారు. కానీ, సాధ్యమవుతుందా? అయిదు కిలోమీటర్ల

దూరంలోని సంతకు వెళ్ళాలంటే పెట్రోలు ఖర్చు? నాలుగైదు రోజులకు సరిపడే స్టాక్ ఇంట్లో పడేయాలంటే అందరికీ ఫ్రిజ్జులుండొద్దూ.

"ఓ సారూ! అంతగనం గరం ఎందుకైతవ్ గని, అమ్రీకా నుండచ్చిన మాల్ అయితే ఇంకా-పిరం గాదు - అగ్గువ పడ్తదన్న సంగతి మర్శిపోతున్నవ్. యాదికి లేదా - గవర్నమెంటు మీ కార్ఖానా ఎందుకు బందు పెట్టిందో. బైటి సరుకు సస్తాల దొర్కుతున్నప్పుడు కోట్లకు కోట్లు నష్టం జేస్తున్న గీ కంపిన్లుండెందుకు, లేకెందుకని సర్కార్ రోజుకో కంపినికి తాలం తయారు జేస్తాంది. రేపు మీది, ఎల్లుండి బొగ్గుబాయిలు, అటెంక కరెంటు..."

అబ్బబ్బ, ఏమిటి దీని వితండ వాదం? తాడిచెట్టు ఎందుకెక్కావయ్యా అనడిగితే, దూడ గడ్డి కోసమన్నట్టుగా ఏవో రాజకీయాలు వల్లిస్తోంది. నష్టాలు, నష్టాలు. వాడెవడో పొగబెట్టాడు, వీళ్ళు ఊదరగొడుతున్నారు. కుళ్ళుబోతు మనుషులు. ఇరవై ఏళ్ళు చక్కగా నడవలేదా కంపనీ? ఇక్కడి ఉత్పత్తుల తోటే, ఇక్కడి ఉద్యోగుల కొనుగోలు శక్తితోటే కదా ఈ ప్రాంతపు గ్రామసీమలు ఎదిగాయి. బొగ్గు గనులు విస్తరించాయి, పవర్ ప్లాంటు వచ్చింది. గ్రామ ప్రజలకు ఉపాధి దొరికింది. వ్యాపారం పెరిగింది. రోడ్లు, బ్రిడ్జిలు, బస్సులు, ఆటోలు- ఎన్ని సౌకర్యాలు వచ్చిపడ్డాయి ఈ ప్రాంతంలోకి. పెళ్ళయి, కొత్తగా కాపరానికొచ్చేటప్పుడు పడ్డ అవస్థ ఇంకా గుర్తుంది కదూ. కాలరీస్‌కు పోయే మెయిన్ రోడ్డు మీద క్రాస్ రోడ్ పాయింటు కాడ దిగి, నాన్న సూటుకేసూ, నువ్వు బ్యాగూ మోస్తూ మధ్యాహ్నపు టెండలో అయిదు కిలోమీటర్లు నడిచి క్వార్టర్సుకు చేరుకున్నారు. ఒకప్పటి ఎడారి అలా అలా అభివృద్ధి చెంది... ఏం లాభం? రాజకీయ కొట్లాటలూ, ఉద్యమాలూ, హత్యలూ కూడా ఎక్కువే అయిపోయి, శాంతిభద్రతలకు కరవు ఏర్పడింది. క్యాజువల్ లేబరర్ల- కాంట్రాక్టు కార్మికుల సంఖ్యాబలం, వాళ్ళు సృష్టిస్తున్న సమస్యల మూలంగానే కంపనీ ప్రతిష్ఠ దిగజారి నష్టాలెక్కువవుతున్నాయని జి.ఎమ్ ఆఫీసర్ల మీటింగుల్లో పలుమార్లు చెప్పారట. ఎట్టకేలకో మంచి పని జరిగింది. క్యాజువల్ లేబరర్ల బెడద సగం మాత్రం వదిలించుకుపోయింది. అయినా, అంగట్లో అన్నీ ఉన్నాయ్ కాని అల్లుడి నోట్లో శని అన్నట్టు దేశంలో నిలకడ లేని రాజకీయాల కగ్గి తలుగ - కార్ఖానాకు నిధులు శాంక్షన్ చేసే విషయంలో ప్రధానమంత్రి సానుకూలంగా స్పందించిన తరుణంలోనే కేంద్ర ప్రభుత్వం కూలిపోయింది. ఇక కంపనీ భవిష్యత్తు ఏమవుతుందో చెప్పజాలని అయోమయ పరిస్థితిదే రాజ్యం.

> "యాదికి లేదా, గవర్నమెంటు మీ కార్ఖానా ఎందుకు బందు పెట్టిందో. బైటి సరుకు సస్తాల దొర్కుతున్నప్పుడు కోట్లు నష్టం జేస్తున్న గీ కంపిన్లుండెందుకు..."

నిప్పు కణికెల మీద నిలబడ్డ పరిస్థితి. గాలి వీచదు. చెమట అసలే ఆరదు. ఎసరు మీద మూత తీయగానే వేడి వేడి ఆవిర్లు గుప్పుమని ముఖాన తాకినట్టు మార్కెట్ అంతటా చిన్న ఉలికిపాటు. అందరి చూపులూ కూరగాయల 'అమ్మవారి' వైపు తిరిగాయి. ఆటో రిక్షా స్టాండు సమీపంలో కల్వర్ట్ మీద కూర్చుని దినపత్రిక చదువుతున్న తెల్ల ఖద్దరాయన - మాజీ యూనియన్ లీడర్- తల ఎత్తి ప్రపంచ పోకడని ఔపోశన పట్టిన వేదాంతిలా, "నష్టాలకు కారణం కార్మికులు కాదు. సమస్యంతా టెక్నాలజీది. పాతకు స్వస్తి చెప్పి, కొత్తకు ఆహ్వానం పలుకుతున్న సంధి కాలం ఇది. కొత్త ఆర్థిక సూత్రాలు, కొత్త వాణిజ్య ఒడంబడికలు, కొత్త అభివృద్ధి నమూనాలు... సర్వత్రా కొత్త కొత్త. మనమూ మడిగట్టుకు కూర్చోలేము కదా. సరళీకరణ, సంస్కరణలు లేకపోతే మనం మరో నూరేళ్ళు వెనకబడిపోతాము. అయినా, మార్పుల కారణంగా ప్రజలు పొయ్యిలో పడ్డ చందం కాకూడదు. ఇంత పెద్ద కార్ఖానా బంద్ చెయ్యడం అంత ఈజీ కాదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడో మాట, గద్దె మీదున్నప్పుడు మరో పాట. ఈ ధోరణి మనం ఎండగట్టాలి. ఉద్యమాలు తీయాలి. మా పార్టీ నాయకత్వంలో వచ్చే నెల ఛలో ఢిల్లీ కార్యక్రమం రూపొందిస్తున్నాం. పార్లమెంటు ముందర ధర్నా. అందరూ కదలాలి."

"నేను సుత గదే అంటున్నా సారూ. మీ కష్టం, మా కష్టం ఎటుబోతానయో తెల్వదు. మీరనే ఆ కొత్త కొత్త నమూనాలచ్చినంక అందరమూ ఒకటె పొయ్యిలో బడ్డ మిడుతలమైనమ్. ఏడ బోకుట్టుకున్నమో యాడనే వెతుకులాడుకోవాలె. ఇయ్యాల కాజ్యుల్ మజ్దూర్లు రోడ్లమీన పడ్డరు. రేపు ఉజ్జోగస్తులూ... ఒకసారి రోడ్ల మీన పడ్డామంటే ఎన్ని తిప్పలో సదువుత లేనూ, ఇంటలేనూ. అడుగుండ్రి, అడిగేటోణ్ణి పట్టుకుని అడుగుండ్రి. ఇస్త్రయికులు జెయ్యుండ్రి. అదేందో ఉరుమురిమి మంగలం మీన పడ్డట్టు మేమే దొర్కినమా." ఆహాఁ, పిర్ర మీద గిల్లి అయ్యో అనే టక్కరిలా ఉంది ఈ గడుసుది.

"ఏందమ్మో, వంకరగ మాట్లాడుతానవ్. నేనుత్తగనే నీ మీద రువాబ్ చేస్తున్ననా?"

"ఆ మాట నేనన్నానా సారూ!"

"ఓ స్వామీ, ఆమెతో వాదులాట ఎందుకయ్యా? ఇండియాలో ట్రేడ్ యూనియనిజం పూర్తిగా ఫెయిల్యూర్. చేతులు కాలినంక ఆకులు పట్టుకున్నట్టు స్ట్రైకులు, మన్నూమశానం ఎందుకిప్పుడు? రైల్వే, పోస్టల్, టెలికామ్, ఆర్టీసీ శాఖల మెడలే విరిగాయి. నువ్వెంత? గుడ్డిలో మెల్ల అన్నట్టు వేజ్ రివిజన్ కొరకైనా గట్టిగా లీగల్ పోరాటం చేద్దాము..."

గడ్డం పెద్దమనిషి జోక్యం. లౌక్యంతో జోక్యం. ముఖ్య విషయం మీద నమ్మశక్యమైన సలహా. ఇదన్నా ఫలిస్తుందా? దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు, ఊరేగింపులు, రాస్తా రోకోలు, లాఠీ చార్జీలు, దీక్షలు, మహజర్లు, హామీలు- అన్నీ గాల్లో కలసిన పేలాల పిండిలా కృష్ణార్పణం. వాడిదో మాట వీడిదో పాట. ఆ పార్టీదో తోవ ఈ పార్టీదో పంథా. ఎవడి దోవ వాడిది. అందరూ కల్సి అందర్నీ నట్టేట ముంచారు. దీర్ఘ దర్శులు లైఫ్ బోట్లు పట్టుకుని ఆవలి తీరం వెళ్ళిపోయారు. ఈ ప్రాప్తకాలజ్ఞుడు నీ మాట ఎన్నడూ వినడు. స్నేహితుల సలహా పెడచెవిన పెట్టాడు. స్నేహితులలో ఒకాయన రిఫైనరీస్‌లో జాయినై ఆ తర్వాత గల్ఫ్ దేశాలకెళ్ళాడు. మరొకాయన- ప్రస్తుతం మీ ఇంట్లో గెస్టుగా ఉన్నాయన- మద్రాసులో ఏదో ఆయిల్ కంపనీలో చీఫ్ ఇంజనీర్. కారు, బంగళా, ఒక చేతిలో మొబైల్ ఫోన్, మరో చేతిలో చిన్ని కంప్యూటర్- ఎప్పుడూ ఫ్యాక్స్, ఇ-మెయిల్ మెసేజీలతోటే విధి నిర్వహణట. ఎంతో తెలివీ, ముందు చూపూ, కార్యదక్షత ఉండబట్టే కేవలం ఎనిమిదేళ్ళ కాలంలో అతను ఇంత పైకెదిగాడు. నిన్న అన్నాగాడితో మాట్లాడుతూ వాడి చదువూ, ఉద్యోగ ప్రయత్నాలూ విని నవ్వారు-

'మీ నాన్న మిమ్మల్ని తనలాగే అల్ప సంతోషులుగా తీర్చిదిద్దుతున్నాడురా అబ్బాయీ! బి.యస్సీ చేశావు. బాగానే ఉంది. బి.ఎడ్ చేసి...? టీచర్ ఉద్యోగంలో స్థిరపడుదామనుకుంటున్నావా? టెస్టులు, ఇంటర్వ్యూలు, పైరవీలు, కోర్టు స్టేలు- ఇలా ఏళ్ళు గడిచాక ఆర్డర్స్. ఏ మారుమూల ఊళ్ళోనో పోస్టింగ్. మూడేళ్ళ వరకూ స్కేలు లేదు. పద్దెనిమిది వందల రూపాయల ముష్టి జీతం. ఏం సుఖమున్నదిరా అందులో. ఆ ప్రయత్నం పక్కన పెట్టు. ఇదిగో, ఈ సుప్రా సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపనీకి వెంటనే అప్లై చెయ్యి. కొత్త గ్రాడ్యుయేట్లకి ఈ కంపనీలో నాలుగేళ్ళ కంప్యూటర్ శిక్షణ ఇచ్చి తమ బ్రాంచీల్లో సిస్టమ్స్ ప్రోగ్రామర్స్‌గా ఉద్యోగాల్లోకి తీసుకుంటుంది. విదేశాల్లో కూడా ఉన్నాయి వీళ్ళ బ్రాంచీలు. నెలకి నాలుగు వేల రూపాయల స్టయిఫెండ్. ఆ తర్వాత ఆకర్షణీయమైన జీతభత్యాలు. ఈ హెచ్చార్డీ మేనేజర్ నాకు మంచి మిత్రుడు. నీకు ట్రైనీ అవకాశం వచ్చేలా నేను చూస్తాను' అని చెప్పి ఆ కంపెనీ కార్డు ఇచ్చారు. గెస్టు చలవ వల్ల అన్నాగాడు సంపాదనపరుడైతే కుటుంబానికి ఎంతో మేలు జరుగుతుంది.

ఇక ఇంటికి పద. కూరగాయలు మూడు వెరైటీలు, ఆకులూ కొనడమైందిగా. ఈ కుంపట్లో సెగల నడుమ నుండి వేగిరం బయటికి నడువు. ఇంకేదో కొనాల్సి ఉంది. మర్చిపోయావ్. ఏమిటి? పర్సులో పది ప్లస్ చిల్లర. ఈ తడవ అయిదు రూపాయలన్నా మిగుల్తాయా? నీరసంలో మతిమరుపు. ఉదయపు టెండకే సన్ స్ట్రోక్? రోడ్డు మీద గుగ్గిలం పొగలా రొద. బంగారు మూకుడు సెగలాంటి ఎండలో బేబీ పింక్ కలర్ రిబ్బనొకటి తేలుతూ నన్నని పరిమళపు చారిక ఒకటి కెరలుతూ సరిగ్గా నీ కెదురుగా, నీ కోసమే.

"కమలా! నీకీ సంగతి తెలుసా?"

గునగున నడిచే ఈ పొట్టి వనజమ్మ చాలా విషయాలకు హడావిడే. కానీ, ఈ వేళ కించిత్ ఆదుర్దాగా... ఏదో వార్త మోసుకొస్తూ... నీటుగానే ముస్తాబైంది కాబట్టి అశుభమేమీ లేదులే. అయినా, ఏదో విశేషమే- "ఏమిటీ సంగతి? నాకైతే తెలీదు."

"నిన్న ఊళ్ళో లేవా?"

ఊళ్ళో ఉండకుండ ఎక్కడికి పోయావు గాని, బయటికి రాలేదు. కారణం, నిన్న ఇంట్లో చిన్న స్థాయి ఆత్యయిక పరిస్థితి. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పవరు ప్లాంటుకు చెందిన ఆఫీసరొకాయన గెస్టుని ఇంట్లో దింపేసి వెళ్ళిపోయాడు. చాలా కాలం తర్వాత వచ్చిన బెస్టు ఫ్రెండాయె. స్నేహితులిద్దరూ ఆప్యాయంగా కౌగలించుకున్నారు, కుశల ప్రశ్నలు వేసుకున్నారు. భోజనానికి ఏర్పాట్లు చేయబోతుంటే, తన లంచ్ జ్యోతి నగర్‌లో స్నేహితుడింట్లోనే ముగిసిందన్నాడాయన. దాహం తీర్చుకోవడానికి రంజాన్ లోని నీళ్ళందిస్తే ఆశ్చర్యపోయాడు. దాహం తీరక బేజారైపోయాడు. ఇన్నేళ్ళ సర్వీసు తర్వాతా ఫ్రిజ్జి కొనుక్కోకపోవడమేమిటీ, నిప్పులు చెరిగే ఎండాకాలంలో- అగ్నిగుండంలాంటి రామగుండంలో- కనీసం ఎయిర్ కూలరైనా లేకుండా ఎలా బతగ్గలుగుతున్నారు అని అమితాశ్చర్యం ప్రకటించాడు. హుఁ. ప్రాప్తకాలజ్ఞుడు కిమ్మన్నాస్తిగా నవ్వుతుండిపోయాడు. అందరూ టీవీ ప్రోగ్రాములు చూస్తూ చాలా టాపిక్స్ మీద ముచ్చట్లు. పొరుగింటి నుండి తెప్పించిన ఫ్రిజ్జి నీళ్ళు, రెండుసార్లు కూల్ డ్రింకులు తాగి గెస్టు తాను హాజరైన విదేశీ సెమినార్లు, అమెరికా జీవితం, అరేబియాలో వాతావరణం, ఇన్ఫో విప్లవం, యూరో కరెన్సీపై అనుమానాలు వగైరా విజ్ఞానదాయక విషయాలు చెప్తుంటే వింటూ డిన్నర్‌కి ఏర్పాట్లు... ఉన్నంతలో సాదా సీదా ఆతిథ్యం. రెండు వెరైటీల కూరలు, కొద్దిగా నాన్ వెజ్. రాత్రి స్నేహితులిద్దరూ చిన్నగా మందు పార్టీలో... అలా దినమంతా నీకు ఇంట్లోనే బిజీ - "ఇక్కడే ఉన్నాను గాని విషయం చెప్పు."

"చిట్టీల నాగరాణి లేదూ- అది చిట్ ఫండుల మొత్తం, మంది దగ్గర తీసుకున్న బాకీలన్నీ ఎగ్గొట్టేసి ఎక్కడికో ఉడాయించిందట. అంతా కలిపి పాతిక లక్షల దాకా అవుతుందని అనుకుంటున్నారు."

"ఎక్కడికి పోతుంది? దాని మొగుడు ఇక్కడే ఉన్నాడు కదా."

"ఓసి పిచ్చిదానా. అంతా పథకం ప్రకారం జరిగిందటే. వాడు పి.ఎఫ్‌తో సహా అంతా లోన్ల రూపంలో ఎప్పుడో నాకేశాడట. పోయిన్నెల పాడిన చిట్టీల అమౌంటు ఇంకా ఇవ్వదేమిటా అని మెంబర్లకు అనుమానమొచ్చి విషయం ఆరా తీశారు. విషయం తెలిశాక నిన్న యాభైమంది దాకా ఇంటి మీద పడ్డారు. తన పెళ్ళాం చేసిన లావాదేవీలకూ, తనకూ ఏమీ సంబంధం లేదంటూ దాని మొగుడు చేతులెత్తేశాడట. వాడిని వీధిలోకీడ్చి బండబూతులు తిట్టారు జనం. అబ్బో, ఆ తిట్లకు వేరేవాళ్ళయితే ఉరిపోసుకు చస్తారే. చివరకు హామీ ఇచ్చాడు- వారం రోజుల్లో పెళ్ళాన్ని జనం ముందర నిలబెడతాడట. వీలువెంబడి బాకీలు తీర్చేలా ప్రామిసరీ నోట్లు రాయించి ఇస్తాడట. ఏం హామీలో ఏమో. అంతా నీటి మీద రాతలు."

హమ్మయ్య. పీడా పోయింది. నాగరాణి రాకపోతేనే మంచిది. ఏ దేవుడు బుద్ధి పుట్టించాడో కానీ, నువ్వు పోయిన్నెల పదివేల రూపాయల చిట్టి పాడేశావు. పుణ్యాత్మురాలు ఎనిమిది వేలు మూడు రోజుల్లో చేతుల్లో పెట్టింది. ఇంకా పన్నెండు నెల్లు కట్టాల్సిన చిట్టీ. ఎవరెక్కడ పోతేనేం గప్‌చుప్‌నుండు. – "అది ఇంతమందికి మోసం చేసిందంటే నమ్మలేకపోతున్నాను."

ఆ దొంగదాన్నమ్మి, మూడు పర్సెంటు వడ్డీకి ఆశపడి ముప్ఫయ్ వేలు గంగలో పోశావు గదే అంటూ మా ఆయన ఒకటే మండిపడుతున్నాడు. అంతా మోసమేనే. తడి గుడ్డతో గొంతు కోసేవాళ్ళే. నీతీ, నిజాయితీ బొత్తిగా కరువైపోయాయి. పట్టపగలే ఇండ్లలో దొంగలు పడుతున్నారని అందరూ హడలెత్తి చస్తుంటే, ఈ ఘరానాది ఈ రకంగా దోచేస్తోంది."

ఈ పొట్టిది తన బాధ ప్రపంచపు బాధ చేసేస్తోంది. మూడు కాదు- నాలుగు, అయిదు పర్సెంటయి ఉంటుంది. దురాశకు పోతే నోట్లో... ఎంతైనా గొర్రె కటిక వాణ్ణే నమ్ముతుందట. అర్జంటు అవసరాలప్పుడు ఓ ఫిఫ్టీ ఇవ్వమని ఎంత ప్రాధేయ పడ్డా పైసా పుట్టనివ్వదు ఈ పిసినారి. ఏడవనీ. –"దొంగతనాలా? ఎవరింట్లో?"

"నువ్వు ఏ లోకంలో ఉన్నావమ్మా కమలమ్మా. అయిదు రోజుల క్రితం గౌతమీ నగర్‌లో కంట్రాక్టరు అరోరా ఇంట్లో దొంగలు పడి ఉన్నదంతా ఊడ్చుకుపోలేదూ? మొన్న- మొన్నంటే మొన్ననే కంసాలి వీరయ్య ఇంట్లో- పక్కింట్లో పెళ్ళి జరుగు తున్నది. సందట్లో సడేమియా అన్నట్టు- ఎవరో బంధువుల్లాగే చొరబడి నిశ్శబ్దంగా



బంగారమూ, నగదూ దోచుకుపోయారు. ఊరంతా తెలుసు, వార్తలు పేపర్లలోనూ వచ్చాయి. పోలీసులు అనుమానిస్తున్నట్టు ఇది క్యాజువల్ లేబరర్ల పనే."

లేబరర్ల బర్తరఫ్ తర్వాత కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయని వాళ్ళూ వీళ్ళూ అంటుంటే ఊరేగింపులు, ధర్నాలు, ఉద్యోగస్థులలో ఘర్షణలు, పోలీసు క్యాంపులు వగైరాలే ఊహకు తట్టాయి కానీ, ఈ రకమైన ప్రమాదాలూ పొంచి ఉన్నాయా?- "వాళ్ళు ఇంతకు తెగించారా?"

"చోరీలే కాదు, ఖూనీలు చేసేందుక్కూడా వెనుకాడరు. కరువు దాడుల గురించి ఎప్పుడైనా విన్నావా? ఊళ్ళల్లో జరుగుతాయి. బీదా, బిక్కీ, అలగా జనం 'అన్నల' నాయకత్వంలో రైతుల ఇళ్ళల్లో పడి ధాన్యం, నగదు ఎత్తుకుపోతారు. అయితే, ఇవి ఎక్కువ కాలం సాగలేదనుకో. మా బాబాయిగారి ఊరు రత్నపూర్‌లో పోయిన్నెల అలాంటి దాడి ఒకటి పోలీసులు తిప్పికొట్టారు. కమాన్‌పూర్ శివార్లలో ఎదురు కాల్పులు జరిగాయి. దినపత్రిక జిల్లా ఎడిషన్ మొదట పేజీలో ఖతమైన దళ నాయకుని ఫోటో వచ్చింది. వాడు ఈ ప్రమీల మొగుడేనట..."

"ఎవరూ. ఈ కూరగాయలమ్మే ప్రమీల మొగుడు?"

"అదే. మైసమ్మలా కూర్చునుంది చూడూ. ఇంకా లేబరర్లను ఎన్ని ఘాతుకా లకు ఉసిగొల్పుతుందో తల్లి. సరే, ఆ సంగతలా పోనీ. రేపు నాగరాణి చేత మోస పోయిన వాళ్ళందరమూ క్లబ్ మెంబర్ ధనలక్ష్మి గారింట్లో మీట్ అవుదా మనుకుంటున్నాము. నిన్ను తర్వాత కలుస్తా. వెళ్తా. రేపు మీటింగు. మర్చిపోకు."

మీటింగ్ అట. గాడిద గుడ్డు అట. మీటింగు పెట్టి ఏమి సాధిస్తారు? ఎవరెవరు ఎంతలేసి మొత్తాలు నాగరాణికిచ్చారో ఏకరువు పెట్టుకుంటారు. ఆ తర్వాత ఓ లాయర్ని- ధనలక్ష్మి తమ్ముడు కరీంనగర్‌లో పేరుమోసిన వకీలట. వాణ్ణి సంప్రతిస్తారు. అయినా, ఈ తేలు కుట్టిన దొంగలు పూర్తిగా బయటపడతారా. త్రీ పర్సెంటు, ఫోర్ పర్సెంటు. అసలు కన్నా వడ్డీలే రెండు రెట్లు లాగేసి ఉంటారు. నాగరాణి తెలివి మీరింది. వడ్డీలకు దాఖలాలు చూపించకుండా ఉంటుందా. అదే జరిగితే వీళ్ళ నోళ్ళల్లో చివరికి పడేది బెల్లంగడ్డే. లేదా ఆ కిలాడీ ధనలక్ష్మి దాన్ని భయపెట్టో, బ్రతిమిలాడో తనకు రావాల్సిన బాకీ మాత్రం లాగేసుకుని, మిగతా వాళ్ళను గాలికొదిలేస్తుంది. జిత్తులమారి నాగరాణి అదే జరిగేలా చూస్తుంది. ఈన గాచి నక్కల పాలు చేసుకుంటుందా? ఎప్పుడో అది నోరు జారి రహస్యం విప్పే సింది. ఈ డబ్బంతా ఎక్కడ బెడుతున్నావమ్మా అని అడిగితే, దాని అక్క కోసమనీ, ఆవిడ జంటనగరాల్లో రెండు వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ళు నడిపిస్తున్నదనీ చెప్పింది. ఆ వ్యాపారాలు దానివో, దాని అక్కవో ఆ దేవునికే ఎరుక. ఎవరివైతేనేమి, ఇక్కడి జనం నెత్తి మీద మాత్రం శఠగోపం పెట్టింది. ముక్తితో తరించండి దౌర్భాగ్యుల్లారా.

పదపద ఇంకేదో కొనాల్సి ఉంది కద. అరరే పర్సు...? మతిమరుపు దానా మాటల్లో పడి పర్సు ఎక్కడో పారేసుకున్నావు. ఎక్కడ? కిందా, మీదా, కాళ్ళ దగ్గర, తోవలో, ఊఁహూఁ, చిన్న పిడికెడంత పర్సు ఎక్కడ మాయమైందబ్బా... అబ్బ దొరికింది. కూరల సంచిలో అడుగునున్న కూరగాయల్లో. ఎప్పుడు జారిందో. అయినా, ఏముంది ఇందులో. దారిలో కనపడ్డా ఎవడూ దీన్ని ముట్టుకోడు. చండాలపు పర్సు. బతుకులాగే చివికిపోయి, చిరిగిపోయి, రంగు వెలిసిపోయి- పది ప్లస్ చిల్లర. పాత నోటూ, కొత్త నాణేలూ. చిల్లర ప్లస్ పది. ఎంత చిల్లర బతుకైపోయిందే నీది. చారాణా, ఆఠాణా. గిట్టించి గీపెట్టి, కొసరి కొసరి బేరమాడి మిగిల్చే చిల్లర డబ్బులే నీపాలిట అక్షయ పాత్ర. నెలకు రెండు వందల చిట్టీ. దీపావళి, దసరాకు పిల్లలకు బట్టలు తీయగలిగే నమ్మకమైన వనరు. ప్రాప్తకాలజ్ఞునికి తెలియని రహస్యమైన, నీకే సొంతమైన నీ ప్రైవేట్ ఎకానమీ. కరవు రోజుల్లో పరువుగా బతక గలగడం మాటలా మరి! కరవు, కరవు. ఊడి పడ్డది వేలెడంతయితే, చేసుకున్నది బారెడంత. ఏడేళ్ళ శని కాదు జన్మాంతమూ శనే. కంటికి కనపడ్డ ప్రతి వస్తువూ- శాలువా, రగ్గు, పిల్లవాడి బర్త్‌డే జీన్స్, రాకింగ్ కుర్చీ- సమస్తమూ పల్లెటూరికి బట్వాడా. జీవిత చరమ దశలో ముసలాళ్ళు సుఖంగా, ప్రశాంతంగా ఉండాలట. మరి ఎదుగుతున్న పిల్లల అవసరాలు, సంసా రాన్నీడ్చుకొస్తున్న ఇల్లాలి కోరికలు... గంగలో కొట్టుకుపోనీయా? నిమ్మకు నీరెత్తినట్టుండే ఈ మనిషిని చూస్తుంటే ఒక్కొక్కసారి కిరస నాయిలు పోసి తగులబెట్టాలనిపిస్తుంది. ఎంత కోపమొచ్చినా చివరికి దిగమింగుడు తప్ప నువ్వు ఏం చెయ్యగలవు? గిన్నెలోని పొంగు గిన్నెలోనే ఉండాలాయె. అందరికీ వినపడేట్టుగా కేకలూ, ఇంటి పరువు బజార్న పడేసే గొడవలూ నీకు చేతగాని పనులాయె. కొందరి జీవితం వడ్డించిన విస్తరి. వాళ్ళకే చీకూ చింతా ఉండవు. ఇంకొందరి జీవితం కటిక దరిద్రం. అయినా, చింతించరు. జీవిక కోసం వీళ్ళు ఏమైనా చేస్తారు- హత్యలు, దొంగతనాలు. సామాజిక జీవనం, పరువు ప్రతిష్ఠ, నీతి నియమం- వీటికి వీళ్ళిచ్చుకునే నిర్వచనం వేరేమో! అదిగో ఆ మైసమ్మ- ప్రమీలను చూడు ఎలా కూర్చుందో, ఎలా చూస్తున్నదో. మొగుడు చచ్చిపోయాడు. పిల్లా జెల్లా, అన్నలు, తమ్ముళ్ళు ఉన్నారో, లేదో తెలియదు. అయినా నిశ్చింతగా, నిర్వికారంగా బతుకుతూనే ఉంది. ఆ మొండి బతుక్కి అర్థమేమిటో దానికే తెలియాలి. మరి నీదేరకం బతుకు? ఏమో అదీ తెలియదు. పరువు గురించి మాత్రం ప్రాణం గింజుకుంటుంది. పరువు పరువు. ఇంకెక్కడి పరువు. మొన్న సాయంకాలం పల్లూ నగ్నంగా వీధిలో నడిచొచ్చినప్పుడే నీ పరువు పోయింది. ఛచ, నగ్నంగా అంటా వేమిటే. తప్పు. ఊఁహూఁ. దాదాపు నగ్నంగానే కనపడి ఉంటుంది పల్లూ వీధిలోని వాళ్ళకు. ఎన్ని కళ్ళు చిత్రంగా, ఆశ్చర్యంగా, ఆబగా చూశాయో దాన్ని. మొదట్లో అంత లావూ, సన్నమూ కాని ఒళ్ళు, హాస్టలు తిండి చక్కగా సరిపడి ఏపుగా ఎదిగి నున్నగా కండ పట్టినట్టయింది. ఇంతింత బుగ్గలు, ఛాతీ, బాటమ్! పిచ్చిపిల్ల గమనించుకోలేదు. తొడుక్కున్న పాత సల్వార్ సూటు మరీ బిగువైపోయి వైటల్ స్టాటిస్టిక్స్ ప్రస్ఫుటంగా బయటపడ్డాయి. అందరి చూపులూ పిల్లవైపే. వీళ్ళ కళ్ళల్లో నిప్పులు పొయ్య, వీళ్ళ కళ్ళు కాకులు పొడవ. బాతింగ్ డ్రెస్సు అనుకున్నారా, స్విమ్మింగ్ సూటు అనుకున్నారా. అంత వయసున్న ఆడపిల్లలు వాళ్ళ ఇళ్ళల్లోనూ ఉన్నారు కదా! బుద్ధి లేని పాపిష్టి జనం. ఏం తల్లివే నువ్వు. తల కొట్టేసినట్టయిన ఆ దృశ్యం చూశాక ఉరిపోసుకు చావా ల్సిందేనే. ఛీ. మంగతాయారు ఏమన్నా, అది ఏమనుకున్నా కనీసం మూడు, మూడు డ్రెస్సులన్నా పల్లూ కోసం తీయాల్సిందే. మూల్యంగా రెండునెల్ల ఇంటి బడ్జెట్‌లో తీవ్ర మైన కోత. తప్పదు మరి. మళ్ళా మొదలెట్టు దేవుని పేర ఉపవాసాలు. వారాలకు వారాలు ఒంటిపూట భోజనంతో సరిపుచ్చుకు గడపడం ఆయనకూ, నీకూ కొత్తేమీ కాదు కద.

అయ్యయ్యో. అర్ధగంటో, ముప్పావు గంటో! నీ మతి మండిపోనూ ఇంకా మార్కెట్‌లోనే చస్తావా? గెస్టు అంకుల్‌కీ, తండ్రికీ ఈ పిల్ల టిఫిను వడ్డించిందో, లేదో. పదపద, తొమ్మిదిన్నర దాటిపోయింది. టీవీలో మంచి ప్రోగ్రాము మిస్ అవుతోంది. అరరే, అందమె ఆనందం, సోయగమే సంతోషం, ఫ్యాషన్ ఫ్యాషన్, ఫెమినా మిస్ ఇండియాకో పెహచాన్‌లో... స్టార్ బస్టర్ పాప్పుడమ్ క్లిప్స్. సరాగాల సారీలు నంబర్ వన్ టు త్రీ. పట్టులాంటి చర్మానికి రక్షణ కవచం ఏదో పర్దా హటాయించాలిట. అహహ ఏం రంగు, ఏం సువాసన. ఎంత అందమైందీ లోకం. ఎంత మనోహరమైనదీ వస్త్ర ప్రపంచం? జీన్స్, స్కర్ట్స్, పంజాబీలు, సల్వార్‌లు, షరాయి, గొగ్రా చోళీలు, టాప్ వన్ టీషర్ట్స్... ప్లేన్ ఆర్గంజా, ఆర్గంజా పటోలా డబుల్ జార్జెట్, కంచి చేనేత, శాటిన్ సిల్క్, ఆప్టిక్ వర్క్, మిషన్ ఎంబ్రాయిడరీ. ఆఁహాఁ, యాంకర్‌గా కనపడే అమ్మాయి రోజుకో డ్రెస్సు. ఎంత బాగుంటుంది. ధర? వెయ్యో, రెండువేలో. పల్లూకి చక్కగా సరిపోతుంది. కానీ, కానీ? కలలు కనకే వెర్రి పీనుగా. పద ఇంటికి.

ఆగాగు. ఇంకేదో కొనాల్సి ఉంది. ఏమిటబ్బా. ఫ్రూట్, ఏవైనా పండ్లు కొనాలి. ఇంట్లో వి.ఐ.పి అనదగ్గ గెస్టున్నాడు. నిన్న తృప్తిగా తిని, వంటకాలు చాలా రుచిగా ఉన్నాయి, ఎన్నో రోజుల తరువాత ఇంటి తిండి తిన్న ఫీలింగ్ కలిగింది అన్నాడు. నిజంగా బావున్నాయా. కళ్ళల్లో మెరుపు. నిజమే చెప్పాడనిపిస్తోంది. ఈవాళ ప్యూర్ వెజ్ కావా లన్నాడు. ఏం చేస్తే బావుంటుందో! వెజిటబుల్ పలావ్, ఆలూ క్యాలీఫ్లవర్ కుర్మా, పెరుగు చట్నీ. ఓకే. ఒక సింపుల్ డెసర్టు. నచ్చుతాడా, మ్యాంగో జ్యూస్.

> ఖరీదైన చీరలు, నగలు.... సినిమాలు, షికార్లు, బ్యూటీ పార్లర్లలో అందంగా ముస్తాబులు. ఇంత ఖర్చు, ఇన్ని ఆడంబరాలు వీళ్ళకెలా సాధ్యమవుతోంది? ఎలా, ఎలా?

'దస్ రుప్యా కిలో.' ఎంత బాగున్నాయి మామిడి పండ్లు, బంగారు వన్నె మిసిమితో నిండుగా పెద్దగా నిగనిగలాడుతూ. ఇదే రంగు- మాట తీరులో, నడకలో, ప్రవర్తనలో, రూపంలో ఇదే నిండుదనం. నిజంగా గెస్టు స్ఫురద్రూపియె! పొద్దున కిచెన్‌లో పాలు పొంగించి హడావిడిగా బయటికొస్తూ నువ్వు, టవల్ చుట్టుకుని కూల్‌గా హిందీ పాట హమ్ చేస్తూ బాత్‌రూమ్‌లో నుండి అతను... డైనింగ్ హాల్లో ఒకరికెదురుగా మరొకరు. క్షణం, పదిక్షణాలు, ఒక్క నిమిషం పాటు అలాగే కాళ్ళు భూమిలో పాతేసి చూపులు కలిపి... ఎంత గాఢమైన లోచూపు అతనిది.. ఏదో వైకం. ఇంట్లో ఎవరూ చూడలేదు నయం. నిజంగా డబ్బు, హోదా మనిషికి అందాన్ని, హుందాతనాన్ని పెంచేస్తాయా? కణతల దగ్గర కొంచెం నెరిసినా ఇంకా ఒత్తుగానే ఉన్న జుట్టు, ఎత్తుకు తగ్గ లావు, దార్ఢ్యం సడలని దేహం, బొజ్జరాని పొట్ట, ఛాతీ మీద దట్టమైన వెంట్రుకలు... అదేదో టీవీ యాడ్‌లో కనపడే మాడల్‌లా, అచ్చం అలాగే. ఛ ఛ తప్పు. ఏమిటి నీ ఆలోచనలు వక్రంగా సాగుతున్నాయివ్వాళ. ఒళ్ళు కొవ్వెక్కుతున్నదా. బుద్ధిగా ఇంటికి నడువ్.

దస్ రుప్యాసే కమ్ నహీ ఆతా అమ్మా.' ఈ పళ్ళ బండి గెడ్డపోడు కొరకరాని కొయ్య. నాసిరకపు, రాలిన పండ్లయితే చౌగ్గా వస్తాయట. వీడివి మేలిమి రకమట. బంగారు ముద్దల్లాంటి పండ్లు కాదు, నిజంగా నిప్పు ముద్దలు. నువు తాకలేవు. ఎలా? అయిదు రూపాయలన్నా మిగల్చాలి. పది ప్లస్ చిల్లర. పద వేరే చోటికి. ఆరు లేదా ఏడ్రూపాయలక్కిలో. ఎక్కడ? రోడ్డవతల బుక్‌స్టాల్ ఎదురుగా వేపచెట్టు కింద ఎడ్లబండి ఒకటి విడిచి ఉంది. చుట్టూ జనం. పల్లెటూరి ఆసామీ గంపల్తో మామిడి పండ్ల లోడు దింపుతున్నాడు. ఏమిటయ్యీ రసాలా. యస్. జ్యూస్‌కు అవే బాగుంటాయి పద. అయిదు కచ్చితంగా మిగుల్తాయి. పద రోడ్డు దాటాలి. అబ్బ, మరోసారి దట్టమైన కెరటంలా గుగ్గిలం పొగ, హోరు. ఒంటిని కాలుస్తూ వేడి వేడి గాలి తెరలు. ఏమిటిది రోడ్డు దాటకుండా ఒక్కసారిగా అడ్డొచ్చిన వాహనాల మంద. సుమో, జెన్, ఇండికా. పుష్పాలంకృతమైన తెల్లని అంబాసిడర్, ఆ వెనుక వ్యాను, ఆటో రిక్షాలు. 'బంగారు బొమ్మ రావేమే పందిట్లో పెళ్ళి జరిగేనే.' ఓహ్ పెళ్ళి బృందమన్నమాట. ఎదుర్కోళ్ళ కార్యక్రమం. రోడ్డుమీదే పెళ్ళి సందడి.

క్షణంలో దృశ్యంలో మార్పు. పొద చాటు నుండి బయటపడ్డ సీతాకోక చిలుకల్లా వాహనాల్లోంచి దిగుతున్న ఆడవాళ్ళు, మొగవాళ్ళు, పిల్లలు. పట్టు చీరల సరసరలు, బాడీ స్ప్రేల గుబాళింపులు, ఆభరణాల చమ్కాయింపులు, కొత్త డ్రెస్సుల బరబరలు... ఓహ్ ఎంత అందంగా ఉన్నాయి లేటెస్ట్ మోడల్ చీరలు. ఆమె ఎవరో పొడుగ్గా, తెల్లగా... ఆకుపచ్చ చీరంతా మీనా టచ్‌తో జాల్‌వర్క్ చేసి ఉంది. జార్జెట్ శారీ అయివుండాలి. ఆమె పక్కనున్నావిడ కట్టుకున్న నల్లచీర అంజికంజి సెల్ఫ్ చెక్ వెరయిటీ, డబుల్ కలర్స్‌తో నేసిన బోర్డరు, కొంగు ఎంత మనోహరంగా ఉన్నాయి! ఇంకొకావిడ చీర క్రేప్ షేడెడ్- నెమలి పించంలా. నెట్‌మీద జర్దోసి వర్క్ అద్భుతంగా కనపడుతోంది. అంతా ఫ్యాషన్ పెరేడ్‌లాంటి వాతావరణం. ఎర్రటి ఎండలో రోడ్డుమీద ఇంద్రధనుస్సు. ఇలాగే నిలబడి చూడాలనిపిస్తోంది. ఎంతెంత పోసి ఎక్కడ కొన్నారో ఈ చీరలన్నీ. రాళ్ళ వంకీలు, రవ్వల నెక్లెస్‌లు, డైమండ్ హారాలు. అనాకారి సైతం అందగత్తెలా పోజిస్తోంది. ఇంతకీ పెళ్ళికూతురెక్కడో. ఎక్కడబ్బా. ఎలా ఉందో! ఒళ్ళంతా బంగారమేనా. వీళ్ళ అదృష్టం పాడుగాను- ఖరీదైన చీరలు, నగలు, పిల్లల రెసిడెన్షియల్ కాలేజీల చదువులు, వృత్తివిద్యా కోర్సుల్లో సీట్లు, సినిమాలు, షికార్లు, బ్యూటీపార్లర్లలో అందంగా ముస్తాబులు. ఇంత ఖర్చు, ఇన్ని ఆడంబరాలు వీళ్ళకెలా సాధ్యమవుతోంది. ఎలా, ఎలా?

"కమలా, ఓయ్ కమలా! రోడ్డుమీద నిలబడి ఏమిటా పరధ్యానం? కారు హారన్ వినపడ్డం లేదా. అడ్డంగా నిబడ్డావ్, ఇలా పక్కకు రా."

ఛఛ. ఏమయిందే నీకు. మతి చెడిందానిలా గుడ్లప్పగించి పరిసరాలు మర్చిపోయి... నలుగురూ నవ్వేరు జాగ్రత్త. ముక్కుపుటాలదిరే సెంటు వాసనతో నీటుగా ముస్తాబై ఉన్న ఉమారాణి చెయ్యి పుచ్చుకు నిన్ను పక్కకు లాగుతూంది. "అర్జంటు అవసరం పడి వేళకాని వేళ మార్కెటుకొచ్చాను. ఎండ మూలంగానో, పొగ ఘాటుకో ఒక్క నిమిషం ఎలాగో అయిపోయాను."

"సరి సరి. తనకు చేదోడు వాదోడుగా ఉండేందుకు మనందరినీ వేకువనే పందిట్లోకి రమ్మని అంతగా చెప్పిందికదే ప్రసూనమ్మ. ఏర్పాట్లన్నీ అలాగే ఉన్నాయి. అదిగో మగ పెళ్ళి బృందం వచ్చేసింది. నేను దోవలోనే ఉన్నాను. నువ్వు ఇంకెక్కడో ఉన్నావు! ఇంటికెళ్ళి షవర్ బాత్ చేసి తయారై అర్ధగంటలో హాలుకొచ్చెయ్. ఏమయింది నీకు. ఆరోగ్యం బాగులేదా?"

"నేను రాకుంటే ఏం. మీ వాతావరణంలో నేను నప్పను దిష్టిబొమ్మలాగా. ప్రస్తుతం నాకు చీరలు కొత్తవేవీ లేవు."


"వెర్రిదానా, ఎదుటివాళ్ళ సంపాదన చూస్తూ గిల్టీగా ఫీలవడం సరికాదు. సంపాదనకి నూటొక్క మార్గాలున్నాయి. వెనుక కూడబెట్టుకున్న ఆస్తిపాస్తులు లేదా మొగుడి మంచి జీతం లేదా చిన్న వ్యాపారాల ద్వారా లాభార్జన వగైరాలు... ఇవికాక నీకు చేతనైన మార్గం మరోటి, ఏమనుకోవు కదా, చెప్పమంటావా? ఇలా పక్కకు, దగ్గరగా రా. రహస్యం."

ఏమిటి దీని ఉద్దేశం. ఏమిటా చూపులు మగాడిలా ఒళ్ళంతా గుచ్చి గుచ్చి. "ఊఁ చెప్పు."

"నలభయ్యో పడిలో కూడా నీ పర్సనాల్టీ బాగుంది. మంచి తిండి తింటే ఇంకా నిగనిగలాడతావు. ఆర్నెల్లకోసారి బొంబాయి, మద్రాసు వంటి నగరాలకి వెళ్ళి వారం రోజులు గుట్టుగా గడిపి వేలకు వేలు సంపాయిస్తున్న ఆడవాళ్ళు ఈ పట్నంలో అయిదారుగురున్నారు. వివరాలు తర్వాత."

ఛీ ఛీ. దీని పాడు సలహా కాలిపోను. మళ్ళా అంటే చెప్పుచ్చుకు కొట్టు. పద ఇంటికి. గుండె దడ ఇంకా తగ్గదే. బస్ షెల్టర్ గోడ మీద ఇంగ్లీషు సిన్మా వాల్ పోస్టరు పెద్దగా... హాలీవుడ్ అర్ధనగ్న తార మగవాళ్ళని కవ్విస్తూ, నిన్ను హేళనగా చూస్తూ... నీదగ్గరున్న వనరు నువ్వు నిజంగా మర్చిపోయావేమో ఆలోచించు మరి. ■

NCL INDUSTRIES LIMITED
AN ISO 9002 COMPANY




Phone: 3203637,3202548
Fax:3202496,3203417